క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖానాపురం పారిశ్రామిక ఏరియా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ పరిధిలో బల్లేపల్లి సెంటర్ వద్ద డ్రెయినేజీ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ రఘునాథపాలెం ఏడీ సంజీవ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పాండురంగాపురం పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'చాంబర్' ఓటర్ల జాబితా విడుదల

ఖమ్మంగాంధీచౌక్: చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలకు సంబంధించి సర్వసభ్యుల జాబితాను గురువారం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో విడుదల చేసి నోటీస్ బోర్డులో ఉంచారు. నవంబర్ 16న ఎన్నికలు జరగనుండగా.. మొత్తం 1,305 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షులు సోమ నరసింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్రిమెంట్ లేకుండా సాగు చేయొద్దు

కామేపల్లి: ఆడ, మగ రకం సీడ్ మక్క విత్తనాలు సాగు చేసే రైతులు సదరు కంపెనీ నుంచి అగ్రిమెంట్ తీసుకోకుండా సాగు చేయొద్దని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మక్క సాగుకు రైతులు ఆసక్తి చూపుతుండడంతో కొన్ని కంపెనీలు తమ కంపెనీ విత్తనాలతో అధిక దిగుబడి సాధించడంతో పాటు ఆదాయం వస్తుందని కొందరు ఏజెంట్లు రైతులను మోసం చేస్తున్నారని, వారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకున్నకే విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

రవాణాశాఖ నిబంధనలు పాటించాలి

ఖమ్మంక్రైం: రవాణాశాఖ నిర్దేశించిన రీతిలోనే నంబర్ ప్లేట్లు, కంపెనీ సైలెన్సర్లు ఉండేలా వాహనదారులు చూసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ప్రతీ రోజు నంబర్ ప్లేట్ లేని వాహనాలతో పాటు సైలెన్సర్ మార్చి నడుపుతున్న వాహనాలకు ఫైన్ వేస్తున్నట్లు తెలిపారు. పాత చలాన్లు చెల్లించడంతో పాటు సైలెన్సర్ మార్చిన తర్వాతే పంపిస్తున్నామన్నారు. పోలీసులకు సహకరించి మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు.

60 గ్రాముల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం కస్బాబజార్‌లో టిఫిన్ సెంటర్ నడిపే కోల్‌కత్తా వాసి షేక్ నుంచి వన్‌టౌన్ పోలీసులు గురువారం 60 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి పలువురికి అమ్మడమే కాక తాను సేవిస్తున్నాడని గుర్తించారు. ఈమేరకు షేక్‌ను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కంటి గాయాలకు ఉచిత చికిత్స

ఖమ్మంవైద్యవిభాగం: దీపావళిని పురస్కరించుకని టపాసులు కాల్చడం వల్ల కలిగే కంటి గాయాలకు తమ ఆస్పత్రిలో కన్సల్టేషన్, శస్త్రచికిత్సలు ఉచితంగా అందించనున్నట్లు వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు అజ్మీర కిషన్, ఎస్‌వీఎం శివరాం, సీపా సృజన్ తెలిపారు. గురువారం వైరారోడ్‌లోని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ అవకాశం 15 ఏళ్లలోపు పిల్లలకు అక్టోబర్ 24వ తేదీ వరకు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పేషంట్ల నుంచి ఫార్మసీ, అనస్తీషియా, ఆప్టికల్ సేవలకే ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు.ఈ సమావేశంలో మేనేజర్ బాల మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కాల్వొడ్డులో ఉన్న శ్రీసత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించే కార్తీకమాస ఉత్సవాల కరపత్రాలను గురువారం తెలంగాణ దేవాదాయ శాఖ స్థపతి వల్లినాయగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తీకమాస ఉత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కమిషనర్ ఎం.వీరస్వామి, వరంగల్ జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్.రమేష్‌బాబు, ఆలయ ఈఓ వీవీ నరసింహారావు, అర్చకులు కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో పత్తి పంట



తెల్లబోతోంది..

పత్తితీతకు కూలీల కొరత

- వర్షానికి పాడవుతున్న పత్తి కాయలు
- గణనీయంగా తగ్గిన దిగుబడి
- నల్లబారుతుండడంతో ఆందోళనలో రైతులు

పత్తి సాగు వివరాలు..

డివిజన్	ఎకరాలు
ఖమ్మం రూరల్	12,823
నేలకొండపల్లి	4,487
కూసుమంచి	11,510
తిరుమలాయపాలెం	15,629

నేలకొండపల్లి: ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తి రైతులు సతమతమవుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినట్టే పట్టి మళ్లీ కురుస్తుండడంతో తీతకు వచ్చిన పత్తి అంతా పొలంలోనే రాలిపోతోంది. ఓ వైపు కూలీలు దొరక్క.. మరోవైపు దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పాలేరు నియోజకవర్గంలో 44,449 ఎకరాలకు పైగా పత్తి పంట సాగు చేశారు. అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా దిగుబడులు తగ్గి పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

దిగుబడి.. దిగజారి

వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది పత్తి రైతులు దారుణంగా నష్టపోతున్నారు. ఎకరానికి 15 క్వింటాల వరకు దిగుబడి రావాల్సి ఉండగా.. ప్రస్తుత పరిస్థితుల్లో 4 క్వింటాల మాత్రమే దిగుబడి వస్తుండడంతో కూలీల ఖర్చులకు మాత్రమే సరిపోతుందని రైతులు వాపోతున్నారు. కూలీలు కొరతతో సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనం (కిరాయి) ద్వారా పత్తితీత కోసం కేజీ రూ.15 చొప్పున చెల్లిస్తూ కూలీలను తీసుకొస్తున్నారు. ఎకరానికి దాదాపు రూ.50 వేల వరకు, కౌలు రైతు మరో రూ.20 వేలు అదనంగా పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్నా.. ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదని ఆవేదన చెందుతున్నారు.

వర్షం దెబ్బ..

ఇటీవల కురిసిన వర్షాలకు చాలా చోట్ల పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఈ సారి తెల్లబంగారం అప్పుల నుంచి గట్టెక్కిస్తుందని ఆశించిన రైతులకు మరిన్ని అప్పులు చేస్తుందని ఆందోళన చెందుతున్నారు. అసలే దిగుబడి లేక ఇబ్బంది పడుతున్న రైతులకు పత్తి నల్లబారుతుండడంతో మరింత నిరాశ మిగులుతోంది. దీనికి తోడు ఇంకా సీసీఐ కేంద్రాలు ప్రారంభించకపోవడంతో దళారులు వారి ఇష్టానుసారంగా ధరను నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతు ఇక్కడ కూడ రైతులు నష్టపోతున్నారు. సతమతమవుతున్న పత్తి రైతులను ఎలా గట్టెక్కిస్తారో వేచి చూడాల్సిందే మరి.

12 ఎకరాల్లో సాగు చేశా..



ఈ ఏడాది 12 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. వాతావరణం, అధిక వర్షాలతో ఎకరానికి 4 క్వింటాలకు మించి వచ్చే పరిస్థితి కన్పించడంలేదు. రూ.లక్షల పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే.. తీరా దిగుబడి కూడా రావడం లేదు. కనీసం ఉన్న పత్తిని విక్రయించుకుందామంటే సీసీఐ కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయలేదు.

– ఉండమోదుగుల వెంకటేశ్వర్లు, రైతు, ముజ్జుగూడెం

నష్టపరిహారం అందించాలి..



ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలపై సర్వే నిర్వహించి నష్టపరిహారం అందించాలి. కానీ సంబంధిత అధికారులు నేటి వరకు నష్టం అంచనాలు వేయలేదు. దిగుబడులు తగ్గి రైతులు అప్పుల పాలవుతున్నారు. వెంటనే అధికారులు సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలి.

– మారిశెట్టి వెంకటేశ్వరరావు, రైతు సంఘం నేత, నేలకొండపల్లి

సీసీఐ కేంద్రాలు తెరవాలి..



సీసీఐ కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి. పత్తి విక్రయాల కోసం కొత్తగా వచ్చిన యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలి. సీసీఐ కేంద్రాలు జాప్యంతో దళారులు రైతులను ఆశ్రయిస్తున్నారు. అసలే దిగుబడి రాక.. కూలీలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– కే.వీ.రెడ్డి, రైతు, నేలకొండపల్లి

రిటైనింగ్ వాల్ సర్వే వేగవంతం చేయాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: మున్నేరు వరద ముంపు నుంచి రక్షించేందుకు చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పొడగింపు పనుల సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని జలవనరుల శాఖ ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సర్వే పనులను ఈఈ అనన్యతో కలిసి ఆయన పరిశీలించి అధికారులు సర్వే బృంద ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. గతంలో చోటుచేసుకున్న వరద ముప్పులను దృష్టిలో ఉంచుకొని రక్షణ గోడ రూపకల్పనకు తగిన విధంగా సర్వే చేసి సమగ్రమైన అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఉదయ్‌ప్రతాప్, ఏఈలు రాజేశ్వరరావు, సంతోష్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

రోడ్ల మరమ్మతులు వేగంగా చేయండి



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్, మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో మరమ్మతులకు గురైన రోడ్ల ప్యాచ్‌వర్క్‌లను వేగవంతం చేయాలని, బీటీ రోడ్లకు బాండ్ మిక్చర్‌ను వినియోగించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలో చేపట్టిన ప్యాచ్‌వర్క్‌లను మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కోల్డ్, హాట్ మిక్స్‌ను వినియోగించడం వలన మరమ్మతులు చేసిన వెంటనే వాహనాలు వెళ్లినా ఇబ్బంది ఉండదని అన్నారు. వాహనదారులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన పనులు చేపట్టాలన్నారు. వారి వెంట ఈఈ కృష్ణలాల్, డీఈలు ధరణికుమార్, శ్రీనివాసరావు, ఏఈలు ఉన్నారు.

అనుమతులు లేని నిర్మాణాల కూల్చివేత..

నగరంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యాన కూల్చివేతలు చేపట్టారు. నగరంలోని బ్రాహ్మణబజార్, అజీజ్ గల్లీల్లో అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలను జేసీబీలతో తొలగించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఏసీపీ వసుంధర సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ తేజస్విని, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దివ్య, శశికుమార్, ప్రవీణ్, దుర్గసాయి కిరణ్ తదితరులు ఉన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు..

నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న వాకింగ్ ట్రాక్‌లో పని చేయని వీధి లైట్లను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేశారు. కేఎంసీ సిబ్బంది జెడ్పీ సెంటర్ నుంచి ఇల్లెందుక్రాస్ రోడ్డు వరకు వీధి లైట్లను పరిశీలించి, అవసరమైన చోట కొత్తవాటిని ఏర్పాటు చేశారు.

ప్రపంచ అనస్తీషియా డే వేడుకలు



తిరుమలాయపాలెం: మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్



కామేపల్లి: సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చందన

తిరుమలాయపాలెం/కామేపల్లి/ఖమ్మంవైద్యవిభాగం: ప్రపంచ అనస్తీషియా డే వేడుకలను వైద్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తిరుమలాయపాలెం సీహెచ్‌సీలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యాన వేడుకలు నిర్వహించి ఆస్పత్రికి మంజూరైన డెంటల్ చైర్‌ను ప్రారంభించారు. అలాగే కామేపల్లి హైస్కూల్, ఆశ్రమ బాలికల హైస్కూల్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన, ఖమ్మం వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ శంకర్ ఆధ్వర్యాన వేడుకలు నిర్వహించి సీపీఆర్, అనస్తీషియా ప్రాముఖ్యతలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ కృపాఉషశ్రీ వైద్యులు సురేష్, బొల్లికొండ శ్రీనివాసరావు, అమర్‌సింగ్, సూరజ్‌కిరణ్, శిరీష, హెచ్‌ఎం శైలా, నెహ్రూ, హెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎస్ రాధాకృష్ణ, వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ రవి, హెచ్‌ఓడీలు, ఎస్ఆర్‌లు, డీఆర్‌పీలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శంకర్

ఖమ్మంవైద్యవిభాగం: హైదరాబాద్‌లో అక్టోబర్ 5 నుంచి నిర్వహించిన తెలంగాణ ఇంటర్ మెడిక్స్ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గరల్స్ త్రోబాల్ పోటీల్లో మూడో బహుమతి, కాలేజీ మేకింగ్ విభాగంలో రెండో బహుమతి సాధించినట్లు కళాశాల బాధ్యులు తెలిపాయి. ఈమేరకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ ఆయన చాంబర్‌లో విద్యార్థులను అభినందించారు.

దరఖాస్తు చేసుకోండి

టీచింగ్ పోస్టులకు..

ఖమ్మంమయూరిసెంటర్: మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖాధికారి ఎండీ.ముజాహిద్ ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి బాయ్స్–1లో టీజీటీ–హిందీ సబ్జెక్టులో జనరల్ స్థానంలో ఒక ఖాళీ, జేసీ ఖమ్మం–గరల్స్–1లో జేఎల్ ఫిజిక్స్ సబ్జెక్టులో మహిళకు ఒక ఖాళీ, ఖమ్మం బాయ్స్–1లో జేఎల్ జువాలజీ సబ్జెక్టులో జనరల్ కేటగిరిలో ఒక ఖాళీ ఉన్నట్లు తెలిపారు. జేఎల్, పీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 50 శాతం మార్కులతో, బీఈడీలో 50శాతం మార్కులతో, టీజీటీ హిందీ పోస్టుకు గ్రాడ్యుయేషన్‌లో 50శాతం మార్కులతో పాటు హెచ్‌పీటీలో ఉత్తీర్ణత, టీఈటీ తప్పనిసరి అని పేర్కొన్నారు. మూడేళ్ల బోధన అనుభవం ఉన్న జిల్లా అభ్యర్థులు మాత్రమే అర్హులని, ఆసక్తి గలవారు తమ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఫొటో కాపీలు, అవసరమైన ఇతర పత్రాలతో జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఈనెల 17 నుంచి 22 సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

వ్యవసాయ పనిముట్ల కోసం..

కామేపల్లి: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా పనిముట్ల కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కామేపల్లి మండలంలో మ్యానువల్ స్ప్రేయర్లు–202, పవర్ స్ప్రెయర్లు–30, రోటావేటర్లు–9, ట్రాక్టర్ పనిముట్లు–20, పవర్ వీడర్–1, పవర్ టిల్లర్లు–2తో పాటు ఇతర పనిముట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, మిగతా రైతులకు 40 శాతం సబ్సిడీపై ఇవ్వనుండగా.. అర్హులైన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్‌లతో పాటు పాస్ ఫొటోలతో కలిపి మూడు సెట్లు ఈ నెల 24లోపు అందించాలని సూచించారు.

'జోస్' నింపిన బెంచీల వితరణ



అందించిన బెంచీలతో సంస్థ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని 5వ డివిజన్ బాలాజీనగర్ ప్రాథమిక పాఠశాలకు బంగారు ఆభరణాల సంస్థ జోస్ అలుక్కాస్ సంస్థ ఆధ్వర్యాన రూ.1.52లక్షల విలువైన 30 డెస్క్ బెంచీలు గురువారం అందజేశారు. బెంచీల వితరణతో విద్యార్థుల్లో జోస్ నింపినట్లయింది. ఈమేరకు సంస్థ యాజమాన్యానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లెబోయిన భారతి చంద్రం, పాఠశాల హెచ్‌ఎం జయలలిత, ఉపాధ్యాయులు సునీత, గ్రామ పెద్దలు కొమరయ్య, రాధాకృష్ణ, హుస్సేన్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ అమలు చేయాలి



పోటు రంగారావుతో బీసీ సంఘాల నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈనెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యాన జరిగే బంద్‌కు సహకరించాలని కోరుతూ గురువారం బీసీ సంఘాల ప్రతినిధులు బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ, సీపీఐ, సీపీఎం, ఎంఎల్ పార్టీల నాయకులను కలసి బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీల రిజర్వేషన్లపై కోర్టు తీర్పునకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని, బీసీలు అంతా ఏకమై రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్ ద్వారా బీసీ బిల్లును అమలు చేసేంత వరకూ పోరాటాన్ని ఆపొద్దని కోరారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు గుండాల కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కేతినేని హరీష్ చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, సీపీఐ జిల్లాకార్యదర్శి దండి సురేష్, ఎంఎల్ పార్టీ రాష్ట్ర నాయకుడు పోటు రంగారావు బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకుడు బొమ్మ రాజేశ్వరరావు, కూరపాటి వెంకటేశ్వర్లు, కత్తి నెహ్రూ, మేకల సుగుణారావు, పెరుగు వెంకటరమణ, స్వర్ణకుమార్, బిచ్చాల తిరుమలరావు, విజయ్‌కుమార్, లింగరాజు, శ్రీలక్ష్మి, నరేందర్, సమ్మయ్య, రాజేశ్వరరావు, సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే 18న నిర్వహించే బీసీ బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నారపు నాగ రామాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యామ రవికుమార్‌లు ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా కన్వీనర్లు పిండిపోలు రామ్మూర్తి, బత్తిని మధుగౌడ్ , నీలం వెంకటేష్, నీలం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' మెనూపై అధికారుల ఆరా..



రఘునాథపాలెం: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రత్యేకాధికారి ముజాహిద్

రఘునాథపాలెం/కామేపల్లి: రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును ఖమ్మం జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ మహమ్మద్ ముజాహిద్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార నాణ్యతను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంట విధానం తదితర అంశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.కరుణకుమారి, ఉపాధ్యాయులు రేపాల శ్రీనివాసరావు, ఎస్‌కె.రంజాన్ అలీ, కల్వకుంట్ల రామారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కామేపల్లి మండలం పాత లింగాల కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ సుధాకర్ పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో ఆహార పదార్థాల నాణ్యత, వాటి గడువు తేదీ పరిశీలించడంతో పాటు స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. కొమ్మినేపల్లి హైస్కూల్‌లో ఎంఈఓ వెంకట్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 58వ డివిజన్‌లో ఖమ్మం మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ డ్రెయినేజీ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం 51వ డివిజన్‌లో కల్యాణలక్ష్మి చెక్కును లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, టూటౌన్ ఇన్‌చార్జ్ శెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

ఖమ్మంఅర్బన్: బ్లూమింగ్ మైండ్ పాఠశాలలో జరుగుతున్న ఖమ్మం అర్బన్ మండలస్థాయి క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. తొలిరోజు బాలికల విభాగంలో 600 మంది పాల్గొనగా.. రెండవ రోజు గురువారం బాలుర విభాగంలో 740 మంది, బాలికల విభాగంలో 120 మంది పాల్గొన్నట్లు మండల క్రీడల కార్యదర్శి బియ్యాని కృష్ణయ్య తెలిపారు. క్రీడల కన్వీనర్ అశోక్‌రెడ్డి ఆధ్వర్యాన సాగుతున్న ఈ పోటీల్లో మొత్తం 23 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. 17న ఫైనల్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

మాతా, శిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు



పోషణ మాసోత్సవంలో పాల్గొన్న రామ్‌గోపాల్‌రెడ్డి

ఖమ్మంరూరల్: పోషకాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా సంక్షేమ అధికారి కె.రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. ఐకేసీలో గురువారం జరిగిన పోషణ మాసోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలో మాతా, శిశు సంరక్షణకు నాణ్యమైన భోజనంతో పాటు ఆంగ్ల విద్యను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షాకీరా బేగం, పుష్పలత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సీమంతాలు.. అక్షరాభ్యాసాలు..

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో పోషణ మాసోత్సవంలో భాగంగా గురువారం అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రత్యేకంగా తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. 10 మంది గర్భిణులకు సీమంతాలు, 10 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం, ముగ్గురికి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారాల వలన కలిగే ప్రయోజనాలను ఎంపీడీఓ ఎం.యర్రయ్య వివరించారు. మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, సీడీపీఓ కవిత, ఏసీడీపీఓ రత్నకుమారి, సూపర్‌వైజర్లు పి.నాగమణి, పార్వతీ, వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, సేవాదళ్ కన్వీనర్ నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నిలువ నీడ లేదాయె..

- తిరుమలాయపాలెంలో బస్ షెల్టర్‌కు స్థలం కరువు
- రోడ్డుకు ఇరువైపులా బోర్డింగులు, వాహనాల నిలుపుదల
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



బురద వద్ద ప్రయాణికుల ఇబ్బంది

తిరుమలాయపాలెం: పేరుకే మండల కేంద్రం.. కనీసం ఆర్టీసీ ప్రయాణికులు వేచి ఉండేందుకు షెల్టర్ కూడా లేదు. దీంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ రోడ్లపైనే బస్సులకోసం పడగాపులు కాయాల్సి వస్తోంది. కొన్నిసార్లు చెట్ల నీడన, దుకాణాల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. బస్ షెల్టర్ లేకపోవడంతో బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆగుతుండడంతో ఏ స్థలంలో వేచి ఉండాలో తెలియక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాక ప్రధాన సెంటర్‌లో రోడ్డు పక్కన గుంతలు ఏర్పడి ఏ చిన్న చినుకు పడినా బురదమయంగా మారుతోంది. దీంతో బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ఆ బురదలో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. అయినా గ్రామ పంచాయతీ అధికారులు కనీసం ఆ గుంతలను పూడ్చాలనే ఆలోచన కూడా చేయకపోవడం గమనార్హం.

పెరిగిన వాహనాల రద్దీ..

రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో వచ్చిపోయే వాహనాలు రహదారి వెంబడి నిలబడ్డ ప్రయాణికుల మీదకు వస్తున్నాయి. రహదారికి ఇరువైపులా షాపుల ఏర్పాటు, బోర్డులు ఏర్పాటు చేయడం, రహదారిపైనే ఆటోలు ఇతర వాహనాలు నిలిపి ఉంచడంతో ఆర్టీసీ బస్సులు ఎక్కడ ఆపాలో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో బస్సు ఆపేందుకు ఆటోలు అడ్డుగా ఉండడంతో బస్సులు ఆపకుండానే వెళ్తున్న పరిస్థితులు ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన గుంతలు పూడ్చడంతో పాటు ప్రత్యేక బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని, రహదారిపై వాహనాలు ఆగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల వరంగల్ బస్సు కోసం వేచి చూస్తున్న సమయాన తిరుమలాయపాలెం ప్రధాన సెంటర్‌లో బస్ షెల్టర్ లేకపోవడంతో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ బస్సు బురద గుంత వద్ద ఉన్న ప్రాంతంలో ఆగింది. దీంతో ఆ ప్రదేశం బురదమయంగా ఉండడంతో బస్సు ఎక్కే వారితో పాటు దిగే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.